
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 4 ఫిబ్రవరి 2025



కౌన్సిలర్లతో కలిసి విజయ సంకేతం చూపుతున్న ఎంపీ, ఎమ్మెల్యే



చైర్మన్‌గా ఎన్నికైన డీఈ రమేష్

టీడీపీకి 23.. వైసీపీకి 14 ఓట్లు

- ఓటింగ్‌కు ఇద్దరు వైసీపీ సభ్యుల డుమ్మా
- ఎమ్మెల్యే బాలయ్యతో కలిసి వచ్చిన కౌన్సిలర్లు
- రాద్ధాంతం చేయాలని వైసీపీ ప్రయత్నాలు
- భారీ బందోబస్తుతో అడ్డుకట్ట వేసిన పోలీసులు



మున్సిపల్ చైర్మన్ రమేష్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఆర్డీఓ ఆనంద్.. ఫొటోలో ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎంపీ పార్థసారథి, కమిషనర్ శ్రీనివాసులు



ప్రజలకు అభివాదం చేస్తున్న బాలకృష్ణ

సైకిల్ పురం

మున్సిపల్ చైర్మన్‌గా రమేష్

హిందూపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పురం మున్సిపల్ పీఠం సైకిల్‌పరమైంది. ఆరో వార్డు టీడీపీ కౌన్సిలర్ డీఈ రమేష్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మున్సిపాలిటీలో 38 వార్డులు ఉండగా, 2021 ఎన్నికల్లో 29 వార్డులను వైసీపీ కైవసం చేసుకుంది. టీడీపీకి ఆరు స్థానాలు దక్కాయి. బీజేపీ, ఎంఐఎం, స్వతంత్ర్య అభ్యర్థి ఒక్కోస్థానంలో గెలిచారు. అప్పట్లో 19వ వార్డు కౌన్సిలర్ ఇంద్రజ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. కానీ వైసీపీ హయాంలో అభివృద్ధికి ఎలాంటి ఆస్కారం లేకపోవడంతో అసంతృప్తితో ఉండిపోయారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఛైర్ పర్సన్ ఇంద్రజ పార్టీని వీడారు. గత ఏడాది ఆగస్టు 15న టీడీపీలో చేరారు. ఆ మరుసటి రోజే పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. ఆమె వెంట 12 మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలోకి వచ్చారు. వీరితోపాటు ఎంఐఎం, స్వతంత్ర కౌన్సిలర్, బీజేపీ కౌన్సిలర్ టీడీపీకి మద్దతుగా నిలిచారు. ఇంద్రజ రాజీనామాతో చైర్మన్ స్థానానికి సోమవారం ఎన్నిక నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి రమేష్‌కు 21 మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, హిందూపురం ఎంపీ పార్థసారథి ఓటు వేశారు. దీంతో ఆయనకు 23 ఓట్లు దక్కాయి. వైసీపీకి 17 మంది సభ్యులు ఉండగా (మిగతా 7లో)

అభివృద్ధి.. సంక్షేమం: ఎమ్మెల్యే బాలకృష్ణ



కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల వంటివి. జిల్లాకు పరిశ్రమలు అధిక సంఖ్యలో తెస్తాం. నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తాం. వైసీపీతో విసిగిపోయి, అక్కడ గౌరవం దక్కక ఆ పార్టీ కౌన్సిలర్లు టీడీపీకి మద్దతుగా ఓటు వేశారు. అభివృద్ధి చేస్తామన్న నమ్మకంతో వచ్చారు. ప్రతి రోజూ నియోజకవర్గ సమస్యలపై అధికారులతో మాట్లాడుతుంటాను. నాయకులు, కార్యకర్తల సమస్యలను కూడా ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తున్నాను. నన్ను నమ్మి ఓటేసిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాను. ఇప్పటికే రూ.800 కోట్లు పనుల నివేదికలు ఫైనాన్స్ విభాగంలో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఇటీవలపే పురం అభివృద్ధి గురించి చర్చించాను. ప్రతి చిన్న విషయానికీ వైసీపీ రాద్ధాంతం చేయడం సిగ్గు చేటు. ఐదేళ్లలో వారు పురానికి ఏమి చేశారో ఆలోచించుకోవాలి. మున్సిపల్ చైర్మన్ పదవి టీడీపీకి దక్కడంతో మా బాధ్యత మరింత పెరిగింది.

ముందస్తు ప్రణాళికతో పటిష్ట బందోబస్తు

ప్రశాంతంగా 'పురం' చైర్మన్ ఎన్నిక : ఎస్పీ



పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ముందస్తు ప్రణాళిక, పటిష్టమైన పోలీసు బందోబస్తుతో హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించామని ఎస్పీ వి.రత్న తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ.. నిబంధనలను అనుసరించి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఒకరోజు ముందుగానే హిందూపురంలో పర్యటించి పోలీసు అధికారులతో భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష చేశామని అన్నారు. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని ప్రశాంతంగా ఎన్నిక ప్రక్రియ ముగించామని తెలిపారు.



ఎన్నికల బందోబస్తులో పాల్గొన్న పోలీసులు

ప్రతి అర్జీని పరిష్కరించాలి: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎన్నో వ్యయ ప్రయాసలతో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 224 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం ప్రదర్శించకూడదని ఆదేశించారు. ఫిర్యాదులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సరైన పరిష్కారం చూపించాలన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి అధికారులు సమగ్ర నివేదికలు రూపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ విజయ్‌సారథి, ఆర్డీవో సువర్ణ, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, ఏపీఎంఐపీ పీడి సుదర్శన్, ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ ప్రతినిధి శివరంగప్రసాద్, డీఎంహెచ్‌ఓ ఫిరోజ్ బేగం, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికిరణ్, ఎక్సైజ్ అధికారి సహదేవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆలయంలోకి అనుమతించలేదు

రొళ్ల మండలం మల్లినమడుగు దళితకాలనీకి చెందిన దళితులను గ్రామంలోని బసవేశ్వరాలయంలోకి అనుమతించడం లేదంటూ సోమవారం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు దళితులు ఫిర్యాదు చేశారు. బీసీ కాలనీలోని బసవేశ్వరాలయంలోకి తమను రానివ్వకుండా ఆ కాలనీవాసులు అడ్డుకుంటున్నట్లు చెప్పారు. బసవేశ్వరస్వామి పూజల్లో భాగంగా ఆకుపూజ, శాంతి హోమం చేసేందుకు ప్రయత్నించగా కొంత మంది బీసీలు అడ్డుకుని అనుమతించడంలేదన్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలి

పుట్టపర్తిరూరల్: జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 10న జరిగే జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాలులో ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఈనెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా సంవత్సరం నుంచి 19 సంవత్సరాల పిల్లలకు.. అంగన్‌వాడీ కేంద్రాల్లో 1నుంచి 5 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలను వేయాలన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓ సువర్ణ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, ఆర్బీఎస్కే పీఓ డాక్టర్ నివేదిత పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే విచారణ: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే విచారణ చేసి పరిష్కరించాలని ఎస్పీ వి.రత్న సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ.. ప్రజల నుంచి 60 ఫిర్యాదులను స్వీకరించారు. బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అప్పటికప్పుడే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. కుటుంబ కలహాలు, భూసమస్యలు, సైబర్‌నేరాలు, ఉద్యోగం ఇప్పిస్తానని చేసిన ఆర్థిక మోసాలు, ఆస్తి పంపకాలకు సంబంధించిన వివాదాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాద్రీశుడి ఆలయంలో

నేడు రథసప్తమి వేడుకలు

కదిరి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాస రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు శ్రీవారు సూర్య ప్రభ వాహనంపై విశేష పుష్పాలంకరణతో తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు.

6న మధ్వనవమి ఉత్సవం

ఈనెల 6న మాఘమాసం మధ్వనవమి సందర్భంగా నరసింహస్వామి పుష్పాలంకరణలో హనుమంతు వాహనంపై విహరిస్తారని ఆలయ ఈఓ పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను నెలరోజులకు ప్రారంభిస్తామని.. అందులో భాగంగా ఈఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ అన్నారు.

రారండోయ్.. సేద్యం చేద్దాం..!

- నాలుగేళ్ల తర్వాత భూములు సాగులోకి..
- 1500ఎకరాలకు పైగా భూమిలో వరినాట్లు
- పరిటాల శ్రీరామ్ చొరవతో కాలువల్లో పూడికతీత పనులు
- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీబిజీ

నీటితో నిండుగా ధర్మవరం చెరువు.. ఆయకట్టుకు పుష్కలంగా నీరు



ట్రాక్టర్లతో వరిమడిని దున్నుతున్న దృశ్యం



బోరుబావుల్లో పుష్కలంగా నీరు



వరినాట్లు వేసుకోవడంతో పచ్చదనం పరుచుకున్న ఆయకట్టు

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ధర్మవరం చెరువు ఆయకట్టు వరి పంట సాగుతో పచ్చదనం సంతరించుకుంటోంది. చెరువులో నీరు సమృద్ధిగా ఉండటం, ఆయకట్టుకు ఐదేళ్ల తర్వాత నీళ్లు వదలడంతో బీడు భూములు సైతం సాగవుతున్నాయి. నీళ్ల రాక సేద్యం పనులు మానేసిన రైతులు ప్రస్తుతం సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో కూలీలకు సైతం చేతినిండా పని దొరుకుతోంది. వ్యవసాయ ట్రాక్టర్లకు కూడా డిమాండ్ ఏర్పడింది.

వైసీపీ పాలనలో ఒకసారే..

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కసారి మాత్రమే ఆయకట్టుకు నీరు వదిలినట్లు రికార్డులు చెబుతున్నాయి. చెరువుకు ఆరు ప్రధాన కాలువలు ఉండగా రెండు కాలువల ద్వారా మాత్రమే నీటిని వదిలారు. అయితే కాలువల్లో పూడిక తీయకపోవడం, ముళ్ల కంపలు తొలగించకపోవడం, సకాలంలో నీరు విడుదల చేయకపోవడంతో ఆయకట్టు పూర్తి స్థాయిలో సాగులోకి రాలేదు. అయితే గత ఏడాది కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఆయకట్టు రైతు సమస్యలపై దృష్టి సారించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ చొరవ చూపి కాలువల్లో పూడికతీత పనులు, కంపచెట్ల తొలగింపు పనులు చేపట్టారు. తర్వాత ఆయకట్టుకు నీటిని వదిలారు. దీంతో ప్రస్తుతం నిండుగా ఉన్న ధర్మవరం చెరువు నుంచి నీరు వస్తుండటంతో ఆయకట్టు పూర్తిస్థాయిలో సాగులోకి వస్తోంది.

గతంలో ఆయకట్టు రైతులు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను కలిసి ఆయకట్టుకు నీళ్లు వదిలి బీళ్లుగా ఉన్న భూములు సాగులోకి తేవాలని కోరారు. దీంతో ఆయన టీడీపీ అధికారంలోకి రాగానే తప్పకుండా నీళ్లు వదిలి ఆయకట్టు భూమిని సాగులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఆమేరకు కూటమి ప్రభుత్వం రాగానే వర్షం నీటితో పాటు

పరిటాల శ్రీరామ్ చొరవతో పూడికతీత పనులు

హంద్రీనీవా కాలువ ద్వారా నీరు వదల డంతో చెరువు పూర్తిగా నిండింది. ఈక్రమంలోనే కంపచెట్లతో నిండి పూడిపోయిన ఆయకట్టు కింద ఉన్న ఆరు ప్రధాన కాలువలను వినియోగంలోకి తెచ్చారు. ఇందుకోసం రూ.పది లక్షల సొంత నిధులు వినియోగించారు. అనంతరం అధికారులతో మాట్లాడి ఆయకట్టుకు నీరు వదిలేలా కృషి చేశారు. దీంతో వరినాట్లకు ఆయకట్టు రైతులు సిద్ధమయ్యారు. కంపచెట్ల తొలగింపు, పూడికతీత పనులు చేయించి, ఆయకట్టులో వరి సాగు చేసేందుకు కృసి చేసిన పరిటాల శ్రీరామ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



కళకళలాడుతున్న ధర్మవరం చెరువు

టీడీపీ హయాంలోనే ఆయకట్టు సాగు

గత వైసీపీ హయాంలో వర్షానికి చెరువు నిండినా ఆయకట్టు పూర్తిస్థాయిలో సాగులోకి రాలేదు. అంతకుముందు టీడీపీ హయాంలో కూడా ఆయకట్టు పూర్తిస్థాయిలో సాగులోకి వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయకట్టు పూర్తిగా సాగులోకి వచ్చింది. గతంలో ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది అధిక మంది రైతులు తమ భూమిని సాగు చేసుకుంటున్నారు. చెరువు నుంచి తూముల ద్వారా సకాలంలో నీరు విడుదల చేయడంతో రైతులు సాగుపై ఆసక్తి చూపారు.

ధర్మవరం చెరువు స్వరూపం ఇలా...

ధర్మవరం చెరువు లోతట్టు విస్తీర్ణం	1733ఎకరాలు
చెరువు సామర్థ్యం	373 ఎంసీఎఫ్(మిలియన్ క్యూబిక్ ఫీట్)
చెరువు మరవలు	7
ఆయకట్టు విస్తీర్ణం	1922ఎకరాలు
ఆయకట్టు రైతులు	3164 మంది
ఆయకట్టు కింద ఉన్న కాలువలు	6
చెరువు తూములు	5

కూలీలకు చేతినిండా పనులు

ఆయకట్టు భూమిని సాగు చేసుకోవడంతో కూలీలకు డిమాండ్ విపరీతంగా పెరిగిందని రైతులు చెబుతున్నారు. వరినాట్లు వేసేందుకు మహిళా కూలీలు, దుక్కిదున్నడానికి ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది. మహిళ కూలీలకు రోజుకు రూ.500లు నుంచి 600వరకు కూలి ఇస్తున్నారు. గెనాలు కొట్టేందుకు కూలీలకు రోజుకు రూ.700లు, ట్రాక్టర్ బాడుగలు గంటకు రూ.1000లు చొప్పున వెచ్చించి పనులు చేయించుకుంటున్నారు. వరినాట్లు వేసేందుకు చిన్నూరు, ధర్మపురి, చిన్నూరుబత్తలపల్లి, రావులచెరువు, మల్లాకాల్వ గ్రామాల నుంచి కూలీలు వస్తున్నారు. ధర్మవరం చెరువు కింద 1922 ఎకరాలు ఆయకట్టు భూమి ఉంది. ఇందులో ఇప్పటికే 1500ఎకరాలకు పైగా సాగులోకి వచ్చింది. దీంతో ఆ ప్రాంతమంతా పచ్చదనం పరుచుకుంది.



పెరిగిన భూగర్భజలాలు

రావులచెరువు గ్రామ చెరువుకు ధర్మవరం చెరువు ఏడో మరువ కాలువ నుంచి నీరు వెళ్తుంది. రావులచెరువు చెరువుకు 12కిలోమీటర్ల దాకా పూడిపోయిన కాలువను గ్రామరైతుల విన్నపం మేరకు పరిటాలశ్రీరామ్ యంత్రాల ద్వారా శుభ్రం చేయించారు. అనంతరం ధర్మవరం చెరువు నుంచి నీరు వదలడంతో ప్రస్తుతం రావులచెరువు నిండి మరువపారుతోంది. దీంతో ఆ గ్రామంతో పాటు చుట్టూ ఉన్న 20గ్రామాల్లో బోరుబావులు రీచార్జ్ అయ్యాయి. దీంతో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. పూర్తిగా అడుగంటిపోయిన బోరుబావుల్లో సైతం ప్రస్తుతం మూడు ఇంచులకు పైగా నీరు వస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది: ఆదెప్ప, ఆయకట్టు రైతు, ధర్మవరం



ఆయకట్టుకు నీరు వదలడంతో ఆయకట్టు భూమిని సాగు చేసుకుంటున్నాం. ఎంతో ఆనందంగా ఉంది. గతంలో కాలువలను రైతులంతా కలిసి చందాలు వేసుకుని శుభ్రం చేయించుకునేవాళ్లం. ఇప్పుడు పరిటాలశ్రీరామ్ కాలువలు శుభ్రం చేయించి నీళ్లు వదలడంతో వరి పంట సాగు చేసుకుంటున్నాం. పెట్టుబడి పెట్టినా పంట అనుకూలంగా పండుతుందనే నమ్మకం ఏర్పడింది.

పక్క ఊరి నుంచి వచ్చా..



మాది మల్లాకాల్వ గ్రామం. ఆయకట్టుకు బాగా నీళ్లు వదలడంతో పంట సాగు చేసుకునేందుకు ఇబ్బంది ఉండదని పక్క ఊరి నుంచి వచ్చి సాగు చేసుకుంటున్నాం. ఈ ప్రభుత్వం మంచి పనిచేసింది. ఎకరా భూమిని సాగు చేసుకుంటున్నాను. పెట్టుబడి పెట్టినా పంట పండుతుందనే భరోసా ఉంది.

- మహేష్, మల్లాకాల్వ

కలలో కూడా అనుకోలేదు: పుల్లప్ప, నీరుగట్టు, చిన్నూరు

మూడేళ్లకు పైగా ఆయకట్టుకు నీళ్లే రాలేదు. ఆయకట్టుకు నీరు వస్తాయని కలలో కూడా అనుకోలేదు. కాలువలు బాగు చేయడంతోనే నీళ్లు వస్తున్నాయి. దీంతో మాఊర్లో రైతులంతా పంటలు సాగు చేస్తున్నారు. నేను వరిమళ్లకు నీరుపెట్టేందుకు నీరుగట్టుగా ఉన్నా. నాకు సాగుతో పాటు నీరుగట్టుగా ఉపాధి కూడా దొరికింది. ఆయకట్టు భూమి సాగులోకి రావడంతో రైతులంతా ఆనందంగా వరినాట్లు వేస్తున్నారు.



బడ్జెట్‌లో రైల్వేకు అదనపు నిధులు

డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా



7

మల్టీ పర్పస్ స్టేడియం నిర్మిస్తాం

ఒక క్రీడ... ఒకే సంఘం.. అమలు చేస్తాం..

క్రీడారంగాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం

శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు



6

మళ్లీ ప్రైవేటుకే..



6

మంచి రోజులు వచ్చాయ్..!



6

మంచి రోజులు వచ్చాయ్..!

- ఎస్సీ హాస్టళ్లకు మహర్దశ
- అభివృద్ధి పనులకు భారీగా నిధులు విడుదల
- రెండో విడతలో 34 హాస్టళ్లకు రూ.5.68 కోట్లు..
- పలుచోట్ల పనులు ప్రారంభం



మరమ్మతులకు ఎంపిక చేసిన ఉరవకొండలోని ఎస్సీ బాలుర వసతిగృహం

అనంతపురం ప్రెస్‌క్లబ్/ఉరవకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. శిథిలావస్థకు చేరిన, మౌలిక వసతులు లేని వసతిగృహాలను ఎంపికి చేసి మరమ్మతులు చేపడుతోంది. జిల్లాలో ఇప్పటికే మరమ్మతు పనులు జరుగుతున్నాయి. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో పట్టించుకోకపోవడంతోనే సంక్షేమ వసతి గృహాలు అధ్వాన స్థితికి చేరాయని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తొలి దశలో పది ఎస్సీ హాస్టళ్లు

జిల్లాలో తొలి దశలో 10 ఎస్సీ హాస్టళ్లు, ఒక గురుకుల పాఠశాలను అభివృద్ధి చేయడా నికి ఎంపిక చేశారు. ఆయా భవనాల మరమ్మతుల కోసం రూ. 1.85 కోట్లు విడుదల చేశారు. మూడు నెలల్లోనే పనులు పూర్తి చేశారు. బీసీ సంక్షేమశాఖాధికారులు జిల్లా వ్యాప్తంగా 55 బీసీ సంక్షేమ వసతిగృహాలను అభివృద్ధి కోసం ఎంపిక చేశారు. ఇందులో 28 వసతి గృహాలకు మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన, 27 వసతిగృహాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నివేదికలు పంపారు. ఇప్పటికే వీటన్నింటి కోసం దాదాపు రూ.3.67 కోట్లు అంచనాలు వేసి పంపగా... ఆయా హాస్టళ్లలో పనులు కొనసాగుతున్నాయి. తాజాగా రెండో విడత కింద 34 ఎస్సీ హాస్టళ్లను ఎంపిక చేసి రూ. 5.68 కోట్ల నిధులను విడుదల చేశారు. ఇప్పటికే పలు డివిజన్లలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

డివిజన్ల వారీగా నిధుల కేటాయింపు

రెండో దశలో 34 ఎస్సీ హాస్టళ్ల మరమ్మతులు చేసేందుకు రూ. 5.68 కోట్లు నిధులు విడుదల చేశారు. అందులో అనంతపురం డివిజన్‌లో నెం-1 ప్రీమెట్రిక్ బాలికల వసతిగృహానికి రూ. 16.20 లక్షలు, నెం-2 ప్రీమెట్రిక్ బాలుర వసతిగృహానికి రూ. 17.4 లక్షలు, నెం-4 బాలుర ప్రీమెట్రిక్ వసతి గృహానికి రూ. 22 లక్షలు, ఉరవకొండలోని నెం-2 బాలికల వసతిగృహానికి రూ.17.5 లక్షలు, ఉరవకొండ బాలుర కాలేజీ వసతిగృహానికి రూ. 16 లక్షలు, ఉరవకొండ బాలికల నెం-1 వసతిగృహానికి రూ.17.5 లక్షలు, చాబాల గ్రామ ఎస్సీ బాలుర వసతిగృహానికి రూ.6.7 లక్షలు, ఉరవకొండలోని నెం-2 బాలుర వసతిగృహానికి రూ. 12 లక్షలు, గడేకల్లులోని బాలుర వసతిగృహానికి రూ. 13.5 లక్షలు, కొనకొండ్లలోని బాలుర వసతిగృహానికి రూ.13.61 లక్షలు, వజ్రకరూరులోని బాలికల వసతిగృహానికి రూ.17.78 లక్షలు, తాడిపత్రి డివిజన్‌కు సంబంధించి చుక్కలూరు బాలుర వసతిగృహానికి రూ.18 లక్షలు, తాడిపత్రి బాలికల కాలేజీ వసతిగృహానికి రూ. 28.56 లక్షలు, తాడిపత్రిలోని బాలికల ప్రీమెట్రిక్ వసతిగృహానికి రూ.17.5 లక్షలు, యాడికి బాలికల వసతిగృహానికి రూ.18.9 లక్షలు, దిమ్మగుడి బాలుర వసతిగృహానికి రూ. 13.1 లక్షలు, పెద్ద వడుగూరులోని బాలుర వసతిగృహానికి రూ.13.6 లక్షలు, గుత్తిలోని నెం-1 బాలుర వసతిగృహానికి రూ.14.55 లక్షలు, పామిడి బాలుర వసతిగృహానికి రూ.24.51 లక్షలు, గుత్తి బాలుర కాలేజీ వసతిగృహానికి రూ.17.4 లక్షలు, బుక్కరాయసముద్రంలోని బాలుర వసతిగృహానికి రూ. 20.80 లక్షలు, నార్పల బాలుర వసతిగృహానికి రూ. 19.09 లక్షలు, నార్పల బాలికల వసతిగృహానికి రూ. 19.61, తరిమెల బాలుర వసతిగృహానికి రూ. 22.38 లక్షలు, కళ్యాణదుర్గం డివిజన్‌లోని కళ్యాణదుర్గం నెం-1 బాలికల వసతిగృహానికి రూ. 11.42, కళ్యాణదుర్గం బాలుర కాలేజీ వసతిగృహానికి రూ.17.4 లక్షలు, కళ్యాణదుర్గం బాలికల కాలేజీ వసతిగృహానికి రూ.8.37 లక్షలు, కళ్యాణదుర్గం నెం-3 బాలుర వసతిగృహానికి రూ. 18.2 లక్షలు, కంబదూరు బాలుర కాలేజీ వసతిగృహానికి రూ. 17.38 లక్షలు, కళ్యాణదుర్గం నెం-2 బాలికల వసతి గృహానికి రూ. 13.86 లక్షలు, సోమలాపురం బాలుర వసతి గృహానికి రూ. 17.31 లక్షలు, రాయదుర్గంలోని బాలికల వసతిగృహానికి రూ.17.34 లక్షలు, బ్రహ్మసముద్రంలోని బాలుర వసతిగృహానికి రూ.14.30 లక్షలు చొప్పున మొత్తం 34 వసతి గృహాలకు రూ.5.68 నిధులు విడుదలయ్యాయి.



గుత్తిలో మరమ్మతులకు నోచుకున్న ఎస్సీ బాలుర వసతి గృహం

అన్ని హంగులతో...



జిల్లాలో ఎస్సీ వసతిగృహాల మరమ్మతులకు విరివిగా నిధులు విడుదలవుతున్నాయి. మొదటి విడతలో 10 హాస్టళ్లు, ఒక గురుకులానికి సంబంధించి రూ. 1.85 కోట్లు విడుదలవ్వగా... పనులు పూర్తి చేసి ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో ప్రారంభించాం. ప్రస్తుతం రెండో విడత కింద 34 హాస్టళ్లకు రూ. 5.68 కోట్లు నిధులు విడుదలయ్యాయి. త్వరలోనే అన్ని డివిజన్లలో అన్ని హాస్టళ్లకు మరమ్మతు పనులు పూర్తవుతాయి. అన్ని వసతిగృహాలు నూతన హంగులతో రూపుదిద్దుకోనున్నాయి.

- ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, డీడీ, ఎస్సీ వెల్ఫేర్

జిల్లాలో మల్టీ పర్పస్ స్టేడియం నిర్మిస్తాం

క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేస్తాం

ఒక క్రీడ... ఒకే సంఘం.. అమలు చేస్తాం..

క్రీడారంగాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం

శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు



మాట్లాడుతున్న శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన క్రీడాకారులకు నిలయమైన జిల్లాలో మల్టీపర్పస్ స్టేడియం నిర్మిస్తామనీ, ఇందుకు స్థల పరిశీలన చేస్తున్నామని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఇండోర్ స్టేడియంలో సోమవారం ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో క్రీడారంగాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావడానికి సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. నూతన క్రీడాపాలసీని తీసుకువచ్చారని తెలిపారు. జిల్లాలో ఆర్డీటీ ఉండడం క్రీడాకారులకు వరమన్నారు. ఇలాంటి అవకాశం ప్రతి జిల్లాలో ఉండేలా ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఆర్డీటీ ముందుకువచ్చిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న క్రీడావికాస కేంద్రాలను పూర్తి చేసి, అన్ని వసతులు కల్పిస్తామన్నారు. జిల్లా నుంచి వైసీపీ ప్రభుత్వం తరిమికొట్టిన సాయ్ కేంద్రాలు, అకాడమీలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 44వేల పాఠశాలలకు రూ.30వేలు చొప్పున రూ.18.5 కోట్లతో క్రీడాసామగ్రి అందజేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు చేపట్టారన్నారు. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కోసం రూ.119కోట్ల నిధులు ఖర్చు చేయగా.. అందులో రూ.40కోట్లు దుర్వినియోగమైందన్నారు. దీంట్లో తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్న సైకో రాజు, సజ్జల రామకృష్ణారెడ్డి, రోజా, అప్పటి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డిపై కచ్చితంగా కేసు నమోదు చేసి, నిధులు కక్కిస్తామని స్పష్టం చేశారు. అనంతరం డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, కోచ్‌లతో సమావేశమయ్యారు. క్రీడాకారులు, క్రీడా సంఘాలు, తల్లిదండ్రుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, ఫుట్‌బాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, డీఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, పీవీకేకే సుబ్బారావు పాల్గొన్నారు.

16న జిల్లాస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు

జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఈనెల 16వ తేదీన అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్య చౌదరి తెలిపారు. టోర్నీకి సంబంధించిన పోస్టర్లు సోమవారం ఇండోర్ స్టేడియంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు చేతుల మీదుగా విడుదల చేశారు. బుగ్గయ్యచౌదరి మాట్లాడుతూ.. వెటరన్ సింగిల్స్, డబుల్స్‌లో 35ప్లస్, 40ప్లస్, 45ప్లస్, 50ప్లస్, 55ప్లస్, 60ప్లస్ క్యాటగిరీల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల వారు ఈనెల 14వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 9966103956, 9703263984 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.14



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.14తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 11, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.19 వేలు



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 19వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ. 10,100తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 23 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

గుర్తు తెలియని భయం

యల్లనూరులో గుర్తుతెలియని వ్యక్తుల సంచారం?

ఇటీవల ఒకేరోజు నాలుగిళ్లలో చోరీ

ఇది వారి పనేనని అనుమానం

రాత్రయితే దొంగల కోసం ప్రజల జాగరణ

యల్లనూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తుల సంచారంఉందని జోరుగా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఒకేరోజు నాలుగు దొంగతనాలు జరగడంతో అనుమానం బలపడుతోంది. రెండు కాలనీల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించారని, గతంలో తాము ఎప్పుడు వారిని చూడలేదని స్థానికులు చెబుతుండటంతో మండలవాసుల్లో గుబులురేగుతోంది. గతనెల 19న యల్లనూరులో దేవర తర్వాత ఒకేరోజు నాలుగిళ్లల్లో చోరీలు జరిగాయి. దీంతో రాత్రిపూట ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు.



అయితే పోలీసులు ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతనెల 24న అర్ధరాత్రి సమయంలో ఎస్సీకాలనీలో పుల్లమ్మ, ప్రహ్లాద ఇంటిలో దొంగలు చొరబడి ఇంటిలో ఉన్న నగదుతోపాటు బంగారు ఆభరణాలు అపహరించారు. వెంటనే బీసీకాలనీలోకి ప్రవేశించిన దొంగలు మనోహర్ ఇంటి తాళాన్ని పగలగొట్టి చొరబడి ఇంటిలోని బంగారు వస్తువులతోపాటు మొత్తం రూ.65వేలకు పైగా విలువైన వస్తువులు ఎత్తుకువెళ్లారు. అక్కడి నుంచి యల్లనూరు- తాడిపత్రి ప్రధానరహదారిపై ఊతప్ప ఇంటిలోకి ప్రవేశించి బీరువాను పగలగొడుతుం డగా ఇంటిపక్కన వారు గమనించి గట్టిగా అరవడంతో పారిపోయారు. నిత్యం ఈ రహదారిపై వాహనాలు తిరుగుతుంటాయి. అయినా కూడా దొంగలు నిర్భయంగా దొంగతనానికి ప్రయత్నించారంటే పోలీసుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతుంది.

కొత్త వ్యక్తుల సంచారం?

యల్లనూరు గ్రామ దేవర సందర్భంగా కొత్త వ్యక్తులు మండలకేంద్రానికి చేరుకున్నట్లు సమాచారం. వీరు రాత్రి పూట ఇళ్లమీద పడి దొంగతనాలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీరు పగటి పూటఎవరికి అనుమానం రాకుండా ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్తాచెదారం ఏరుకొంటూ రెక్కీ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇళ్లకు తాళాలు వేసిన వాటిని గుర్తుపెట్టుకొని అర్ధరాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

జాగరణ చేస్తున్న ప్రజలు

ఒకేరోజు నాలుగు ఇళ్లల్లో దొంగతనాలు జరగడంతో ప్రజలు రాత్రి పూట దొంగల భయంతో జాగరణ చేస్తున్నారు. పాతపేటలో బీసీకాలనీలో శనివారం రాత్రి ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు పరిగెత్తుకుంటూ వెళ్లారని, ఆ సమయంలో కాలనీవాసులు కేకలు వేస్తూ వారిని వెంబడించారు. అయినప్పటికి వారు పరారయ్యారు. కోటవీధిలో గత నెల 26న రాత్రి నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి 12గంటల సమయంలో కనిపించారని చర్చించుకుంటున్నారు. దీంతో చిన్నా, పెద్ద తేడా లేకుండా పహారా కాస్తున్నారు.

నిద్రమత్తు వీడని పోలీసులు

మండలకేంద్రంలో ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం నిద్రమత్తు వీడటం లేదు. సాధారణంగా అర్ధరాత్రి సమయంలో పోలీసు సిబ్బంది బీట్‌కు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఆ పని సక్రమంగా చేయడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సిబ్బంది కొరత చూపుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ప్రచారం ఉంది. మండలానికి ఎస్ఐ స్థాయి అధికారి లేకపోవడంతో ఇక్కడ సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పోలీసు ఉన్నతాధికారులైనా చొరవచూపి దొంగల ఆగడాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పుల్లమ్మ ఇంటిలోని బీరువాను పగలగొట్టిన దుండగులు (ఫైల్)

- దొంగతనాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, రాత్రి సమయంలో గస్తీ ఏర్పాటు చేశామని సర్కిల్ సీఐ సత్యబాబు పేర్కొన్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.


7 నుంచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



అథ్లెటిక్స్ పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు సుధాకర్‌బాబు, సికిందర్ తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేతుల మీదుగా విడుదల చేశారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పరుగు, స్పీడ్‌వాక్ పోటీలు ఉంటాయన్నారు. వివరాలు, పేర్ల నమోదుకు 9502539888 నంబరులో సంప్రదించాలని కోరారు.

పిల్లల ఆరోగ్య సంరక్షణకే ఆల్బెండజోల్: కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, డీఎంహెచ్‌ఓ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్య సంరక్షణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. వైద్యశాఖ ముద్రించిన జాతీయ నులిపురుగుల నివారణ దినం పోస్టర్లను స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నులిపురుగులు కడుపులో ఉంటే పిల్లలు అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, శారీరక, మానసిక ఎదుగుదలపైనా ప్రమాదం ఏర్పడుతుందన్నారు. వీటి నివారణకు ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఏడాది నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆ తర్వాత వయసు వారికి పాఠశాలలు, కళాశాలల్లో పంపిణీ వేస్తారన్నారు. కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి పాల్గొన్నారు.

మళ్లీ ప్రైవేటుకే..

శివశంకర్ ఎంటర్ ప్రైజెస్‌కు వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యతలు

కార్యాలయానికి రావద్దంటున్న ఆర్టీఏ అధికారులు



శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్ కేంద్రం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ బాధ్యతలను మళ్లీ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గత వారం రోజుల నుంచి ఆర్టీఏ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ పరీక్షలను నిలిపివేశారు. తిరిగి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఏఎఫ్ఎంఎస్) కేంద్రంలో ఫిట్‌నెస్ పరీక్షలు మొదలు పెట్టారు. గతేడాది సెప్టెంబరు నుంచే ఈ సంస్థకు వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ బాధ్యత అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆర్టీఏ కార్యాలయాలకు బదులుగా అక్టోబరు నెలాఖరు దాకా ప్రైవేటు కేంద్రంలోనే వాహనాలకు పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు ఏజెన్సీల్లో ఫిట్ నెట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతులు లేని కారణంతోనే గతేడాది నవంబరు మొదటి వారంలో ప్రైవేటు ఏజెన్సీల్లో పరీక్షలను తాత్కాలికంగా నిలిపేశారు. అప్పటి నుంచి జనవరి 25వతేదీ వరకు ఆర్టీఏ కార్యాలయాల్లో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ఆర్థిక శాఖ అనుమలు మంజూరైన నేపథ్యంలో ప్రైవేటు ఏజెన్సీకి తిరిగి ఫిట్ నెట్ పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. దీంతో గత వారం రోజుల నుంచి జాతీయరహదారి నుంచి అయ్యవారిపల్లికి వెళ్లే దారిలోని శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ కేంద్రంలో వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.



వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షించే పరికరాలు



వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష చేసే ట్రాక్

చలానా కట్టిన వాహనదారులకు నిరాశే..!

జనవరి 25దాకా జిల్లాలోని 62 మంది తమ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం పరివాహన్ సైట్‌లో చలానా కట్టారు. ఆయా వాహనదారులు సంబంధిత ఆర్టీఏ కార్యాలయాలకు తమ వాహనాలను తీసుకువెళ్లగా ఇక్కడ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం పరీక్ష చేయరని, తిరిగి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ కేంద్రానికి వెళ్లాలని సమాధానం ఇస్తున్నారు. దీంతో వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. పరివాహన్‌లో ఎఫ్‌సీ కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారికి కట్టిన చలానా డబ్బులు వెనక్కి ఇస్తామని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు.

ప్రైవేటు కేంద్రానికి వెళ్లాల్సిందే..

అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ఆర్టీఏ కార్యాలయ పరిధిలోని అన్ని రకాల వాహనాలకు ఇదివరకు ఆయా ఆర్టీఏ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేవారు. ప్రభుత్వం వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను తిరిగి ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో ఇక నుంచి జిల్లాలోని అన్ని రకాల వాహనదారులు జిల్లా కేంద్రం సమీపంలోని శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ కేంద్రానికి వెళ్లాల్సిందే. అక్కడ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఏఎఫ్ఎంఎస్) ద్వారా 15 రకాల పరికరాలతో వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తామని ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఆయా పరీక్షల్లో వాహనం ఫిట్‌గా ఉన్నట్లు నిర్ధారణ అయితేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఇప్పటి నుంచి ప్రైవేటు ఏజెన్సీ కేంద్రంలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల కోసం vahan.parivahan.gov.in.AFMS సైట్‌లో చలానాలు కట్టాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

చలానా డబ్బులు రీఫండ్ చేస్తాం



వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహణ, సర్టిఫికెట్ జారీ బాధ్యతలను తిరిగి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీకి అప్పగించారు. జనవరి 27 నుంచి తిరిగి ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యత ఏజెన్సీకి వెళ్లింది. వాహనదారులు ఇక నుంచి ఆర్టీఏ కార్యాలయాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం రావాల్సిన అవసరం లేదు. జిల్లాలోని అన్ని రకాల వాహనాలను ఫిట్‌నెస్ పరీక్ష కోసం ప్రైవేటు ఏజెన్సీ కేంద్రానికి తీసుకువెళ్లాలి. జనవరి 25 దాకా పరివాహన్ సైట్‌లో చలానాలు కట్టిన వారికి ప్రభుత్వం ఆ డబ్బులను రీఫండ్ ఇస్తుంది. ఆయా వాహనదారులు పేమెంట్ రసీదు, వాహన యమాని బ్యాంక్ పుస్తకం, ఆర్‌సీ, ఆధార్ జిరాక్స్‌లతోపాటు అర్జీని అనంతపురం డీటీసీ కార్యాలయంలో సమర్పించాలి. ఆయా అర్జీలను కమిషనరేట్‌కు పంపించి, కట్టిన డబ్బులను రీఫండ్ అయ్యేలా చూస్తాం.

-వీర్రాజు, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి

ఎస్సీ మహిళల కోసం పీఎంఏజేఏవై

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య



సమావేశమైన డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని దళిత మహిళల జీవనోపాధుల పెంపునకు ప్రధానమంత్రి అనుసుచిత జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై)ను ప్రవేశపెట్టినట్లు డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక బుడ్డప్పనగర్‌లోని ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో సోమవారం పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీడీ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. అర్హులైన మహిళలు పథకం కింద రూ.1 లక్ష నుంచి రూ.3లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణం పొందవచ్చన్నారు. ఇందులో సభ్యులు 10శాతం వాటా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉన్నతి యూనిట్ ద్వారా తీసుకున్న వడ్డీలేని రుణానికి 50 శాతంగానీ, రూ.50వేలుగానీ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, ఏపీఎం మంజుల, ఉన్నతి సభ్యులు పాల్గొన్నారు.

936 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 467 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

● కొండమీదరాయుడి ఉత్సవాలకు సర్వం సిద్ధం ● పది రోజుల పాటు వాహన సేవలు




రథం (ఫైల్)

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగుబంగారంగా భాసిల్లుతున్న కొండమీదరాయుడు బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. స్థానిక దేవరకొండపై పుట్టశిలగా కొలువుదీరిన కొండమీదరాయుడు స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేసింది. ఈనెల 14వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా శ్రీవారు విహరించే 11వాహనాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఫిబ్రవరి 12న జరగనున్నది. ప్రతి ఏటా మాఘ మాసంలో అత్యంత వైభవంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాలు తిలకించడానికి ఏపీతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.


దేవరకొండపై ఉన్న దేవాలయం


స్వామి వారి ఉత్సవ మూర్తులు

వాహన సేవలు ఇలా ...

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 5న స్థానిక కొండ మీద వెంకరమణస్వామి దేవాలయంలో శ్రీవారి ఉత్సవ విగ్రహమూర్తులకు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి, గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం స్వామి కొలువుదీరిన దేవరకొండపైకి తీసుకెళతారు. అనంతరం స్వామి వారిని దేవరకొండపై ఆలయంలో ఉంచి 6న ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అదే రోజున బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, పుణ్యాహవాచనము, ధ్వజారోహణము చేపట్టి స్వామి వారిని తిరిగి స్థానిక ఆలయానికి తీసుకుని వస్తారు. సాయంత్రం పుష్పపల్లకీలో స్వామి వారిని ఊరేగిస్తారు. 7న సింహవాహనం, 8న శేషవాహనము, 9న హనుమద్వాహనము, 10న గరుడవాహనము, 11న శ్వేతగజవాహనముపై శ్రీవారు విహరిస్తారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవము స్థానిక లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో నిర్వహిస్తారు. 12న సూర్య ప్రభ వాహనంపై , 13న అశ్వవాహనము, 14న హంస వాహనముపై విహరించనున్నారు. ఇంతటితో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయి.

12న రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధాన ఘట్టమైన స్వామి వారి రథోత్సవం ఫిబ్రవరి12 జరుగనుంది. ఈ రథోత్సవానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. రథోత్సవం ప్రతి ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున నిర్వహిస్తారు. ఉదయం 11-30 గంటలకు మడుగు తేరు కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం 4 గంటలకు ప్రధాన రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు, ఆలయ కమిటీ ఈఓ రమేష్‌బాబు తెలిపారు.

సైకిల్ పురం

(5వ పేజీ తరువాయి)

14 మంది మాత్రమే ఓటింగ్‌కు హాజరయ్యారు. టీడీపీ అభ్యర్థి విజయం సాధించారని ఎన్నికల అధికారి, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ప్రకటించారు. వైసీపీ తరఫున 3వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి పోటీలో నిలిచారు. రమేష్ చేత ఎన్నికల అధికారి ప్రమాణం చేయించి, డిక్లరేషన్ ఫారాన్ని అందజేశారు.

కౌన్సిల్ హాల్‌లోకి మొదట వైసీపీ సభ్యులు చేరుకున్నారు. టీడీపీ కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే బాలకృష్ణ బస్సులో మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. ఎన్నిక ముగిసేవరకు జై బాలయ్య నినాదాలతో కౌన్సిల్ హాల్ హోరెత్తింది. చైర్మన్‌గా ఎన్నికైన రమేష్‌కు ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎంపీ బీకే పార్థసారథి అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో బాలయ్యను సత్కరించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి 200 మీటర్ల దూరం వరకు ఎమ్మెల్యే వాహనంపై కార్యకర్తలు పూల వర్షం కురిపించారు.

భారీ బందోబస్తు

మున్సిపల్ చైర్మన్ ఎన్నికను రెండు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఎస్పీ రత్న ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయించారు. నలుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 30 మంది ఎస్ఐలు, 200 మంది సిబ్బంది, రోప్ పార్టీ, స్పెషల్ పార్టీ పోలీసులు, వజ్ర వాహనాన్ని పురంలో మోహరించారు. మున్సిపల్ కార్యాలయానికి వంద మీటర్ల పరిధిలో గుంపులు కట్టకుండా చూశారు.


ఓటు వేయడానికి కౌన్సిలర్లతో కలిసి బస్సులో వెళ్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ


రోడ్డుపై బైఠాయించిన వైసీపీ నాయకులు

వైసీపీ నేతల వాగ్వాదం

వైసీపీ అభ్యర్థి తరఫున మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక, ఆమె భర్త వేణురెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, ఇతర వైసీపీ నాయకులు ప్రయత్నించారు. వైసీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాలని భావించారు. ఆ సమయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంజీఎం మైదానంలో ఉన్నారు. ఇరువర్గాలు ఒక్కచోట చేరితే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించి, సీఐలు ఆంజినేయులు, జనార్దన్, ఎస్ఐ శ్రీధర్ సిబ్బంది వెళ్లి వైసీపీవారిని అడ్డుకున్నారు. దీంతో వైసీపీ నాయకుడు వేణురెడ్డి పోలీసులపై విరుచుకుపడ్డారు. అధికారం ఉందని అడ్డుకుంటే ప్రైవేటు కేసులు వేస్తామని బెదిరించారు. సీఐ ఆంజినేయులుతో వాగ్వాదానికి దిగారు. దీంతో తనకు కేసులు కొత్త కాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని సీఐ హెచ్చరించారు. హిందూపురంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని గుర్తు చేశారు. అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీంతో వైసీపీ కార్యాలయం సమీపంలో నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వైసీపీలో గెలిచిన కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు తెలపడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, సీనియర్ నాయకులు నాగరాజు, అనిల్, నెట్టప్ప, వెంకటేశులు, అమరనాథ్, బాబీ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రైల్వేకు అదనపు నిధులు

● డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గత సంవత్సరం కంటే ఎక్కువ నిధులు రానున్నాయని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. బడ్జెట్‌లో రైల్వేలకు కేటాయింపులపై దక్షిణ మధ్య రైల్వే, సౌత్ కోస్ట్ రైల్వేల జీఎంలు, తెలుగు రాష్ట్రాల్లోని రైల్వే డివిజన్ల డీఆర్ఎంలతో రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు గత సంవత్సరం బడ్జెట్‌లో రూ. 9,151 కోట్ల నిధులు లభిస్తే ఈ సంవత్సరం రూ. 9,417 కోట్ల నిధులు దక్కాయని తెలిపారు. 2009 నుంచి ఐదేళ్ల కాలంలో కాంగ్రెస్ పాలనలో ఏపీకి సంవత్సరానికి సగటున రూ. 886 కోట్ల నిధులు లభించాయని, ఎన్డీయే-3 హయాంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 9,417 కోట్లు వచ్చాయన్నారు. అప్పటితో పోలిస్తే 10 రెట్ల అదనపు నిధులు లభించాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎం అరుణ్ మాట్లాడుతూ.. ఈ బడ్జెట్‌లో రైల్వేకు తెలుగు రాష్ట్రాలకు నిధులు ఏయే ప్రాజెక్టులకు ఏమేరకు లభించాయో, కొత్త ప్రాజెక్టులు పరిస్థితి, కొత్త రైళ్ల కేటాయింపు వివరాలపై త్వరలో పింక్‌బుక్ విడుదల చేస్తామని వివరించారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌కు గతంలో లభించిన అమృత్ స్టేషన్లకు, కడప-బెంగళూరు, గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్, గుత్తి-పెండేకల్లు డబ్లింగ్, నడికుడి-శ్రీకాళహస్తి డబ్లింగ్ లైన్లకు నిధుల పెద్ద మొత్తాల్లో లభించే అవకాశముందని రైల్వే అధికారులు అభిప్రాయపడ్డారు. డివిజన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్, సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.

వందేళ్లలో రైల్వే అభివృద్ధి అమోఘం

దేశంలో విద్యుత్ రైళ్ల ఆవిష్కరణ తర్వాత వందేళ్లలో రైల్వేలు శరవేగంతో అభివృద్ధిని సాధించాయని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త పేర్కొన్నారు. దేశంలో విద్యుత్ రైళ్లు ప్రారంభమై వందేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఉదయం వాకథాన్ నిర్వహించారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయం నుంచి రైల్వే అధికారులు, సిబ్బంది పాదయాత్రగా బయలుదేరి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ.. విద్యుత్ రైళ్ల ఆవిష్కరణ తర్వాత రైల్వేలు దేశంలో బలీయమైన ఆర్థిక శక్తిగా మారాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారేంతగా రైల్వేల ప్రాముఖ్యత పెరిగిపోయిందన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన విద్యుదీకరణకు సంబంధించిన చిత్రాల ఎగ్జిబిషన్‌ను డీఆర్ఎం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీఈఈ సుదర్శన్, సీనియర్ డీఎంఈ మంగాచార్యులు, సీనియర్ డీపీఓ క్యాపిల్ అరోరా తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

శవాన్ని బయటకు తీయండి

● హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీలో గుర్తు తెలియని మృతదేహం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నీటిలో శవం తేలియాడుతోందని చెప్పినా పోలీసులు గానీ, లస్కర్లు గాని పట్టించుకోవడం లేదు. ఆ మృతదేహం కుళ్లి, పురుగులు పట్టి, కంపు కొడుతున్నా అధికారుల్లో మాత్రం చలనం లేదు. ఆ శవాన్ని బయటకు తీయాలని కోరినా స్పందించడం లేదు. ఇదీ మండలంలోని దేవగిరిక్రాస్ గ్రామ శివారు హెచ్చెల్సీ 1వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో కనిపించిన గుర్తు తెలియని మృతదేహం కథ. కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానిక రైతులు మూడురోజుల కిందటే పోలీసులకు, లస్కర్లకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోలేదు. రెండురోజుల కిందట పోలీసులు వచ్చి మృతదేహాన్ని చూసి వెళ్లిపోయారు. హెచ్చెల్సీ ప్రధాన కాలువ నుంచి 1వ డిస్ట్రిబ్యూటరీ కాలువకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున మృతదేహం దేవగిరిక్రాస్ దేవగిరి గ్రామ శివారు వరకు కొట్టుకు వచ్చిందని గ్రామస్థులు పేర్కొన్నారు. మృతదేహంపై ఎలాంటి దుస్తులు లేవని కేవలం డ్రాయర్ మాత్రమే ఉందన్నారు. మృతి చెందిన వ్యక్తికి 30 నుంచి 35 సంవత్సరాలు వయస్సు ఉండవచ్చన్నారు. పోలీసులు స్పందించి మృతదేహాన్ని బయటకు తీయాలను స్థానిక రైతులు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి. వీరాపురం గ్రామంలో జయంతి(20) అనే మహిళ సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన సుంకప్ప, నాగప్ప దంపతుల కుమార్తె జయంతికి నాలుగు నెలల కిందట కదరంపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌తో వివాహం చేశారు. గత కొద్దిరోజుల నుంచి ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. ఈనేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ జయనాయక్ తెలిపారు.

పెద్ద ఇల్లని చొరబడ్డారు.. వాచీలతో వెనుదిరిగారు..

● ఆదర్శనగర్‌లో చోరీ ● ఆలస్యంగా వెలుగులోకి..


ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): ట్రిబుల్ బెడ్ రూమ్‌తో కూడిన పెద్ద ఇల్లు. అది కూడా రిటైర్డ్ ఇంజనీర్‌ది కావడంతో దొంగలు పడ్డారు. ఆ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు లేకపోవడంతో దొంగలు నిట్టూరుస్తూ వెనుదిరిగారు. దొరికిందే.. గొప్ప అన్నట్లు విలువైన వాచీలుంటే పట్టుకెళ్లారట. నగరంలోని ఆదర్శనగర్‌లో రిటైర్డ్ ఇంజనీర్ వెంకటప్ప ఇల్లు ఉంది. ఆయన మృతిచెందడంతో భార్య అశ్వత్థమ్మ నివాసం ఉంటున్నారు. ముగ్గురు కుమార్తెలు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అశ్వత్థమ్మ గత నెల 30న పుట్టపర్తికి వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా.. వస్తువులన్నీ చిందరవందరగా కనిపించాయి. సీసీ టీవీ ఫుటేజీలో గతనెల 31న దొంగలు పడినట్లు తేలింది. ఇల్లు విశాలంగా ఉండటంతో దొంగలు బంగారు, డబ్బు ఉంటాయని అంచనా వేసి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని పాములాయిలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్‌లో పదో తరగతి విద్యార్థి అదృశ్యమయ్యాడు. శ్రీసత్యసాయి జిల్లా లోని గోరంట్ల మండలం తాటిమాకులపల్లికి చెందిన కె. మనోజ్ పాములాయిలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్‌లో పదోతరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం 9 గంటలకు స్కూల్ నుంచి అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి దొంగ

- పాఠశాల నుంచి బియ్యం, కోడిగుడ్ల తరలింపు
- ఫొటోలు తీసి పట్టుకున్న కమిటీ చైర్మన్
- హెల్పర్ తీరుపై నాయకుల ఆగ్రహం


కోడిగుడ్లు, బియ్యం తీసుకెళ్తున్న దృశ్యం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం సరుకులను హెల్పర్ ఇంటికి తరలిస్తుండగా పట్టుబడ్డాడు. పాఠశాల కమిటీ చైర్మనే స్వయంగా ఫొటోలు తీసి ఇంటిదొంగ గుట్టురట్టు చేశాడు. నంబులపూలకుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి హెల్పర్ అమీన్‌పీరా కోడిగుడ్లు, బియ్యం, హార్పిక్ డబ్బాలను తీసుకెళుతుండగా.. పాఠశాల కమిటీ చైర్మన్ బాబ్జీ సెల్‌లో చిత్రీకరించారు. అది సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఘటనపై బాబ్జీ విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం సెలవు రోజు పాఠశాల తలుపులు తెరచి కోడిగుడ్లు, బియ్యం, హార్పిక్ డబ్బాలు తరలిస్తుండగా తన కంట పడ్డాడని వివరించారు. అప్పటికే కొన్ని బియ్యం బస్తాలు తరలించారని తెలిపారు. తాను అడిగితే పొంతన లేని సమాధానం చెప్పారని అన్నారు. దీనిపై సోమవారం వివిధ పార్టీల నాయకులు పాఠశాలకు చేరుకుని ఆరా తీశారు. ఎంఈఓలు సుబ్బిరెడ్డి, గోపాల్‌నాయక్, హెచ్ఎం శిరీషా, పాఠశాల కమిటీ చైర్మన్ బాబ్జీ హెల్పర్ అమీన్‌పీరాను విచారించారు. కోడిగుడ్లను ఉడకపెట్టి పంపిణీ చేయడానికి, బియ్యాన్ని శుభ్రం చేయడానికి ఇంటికి తీసుకెళ్లినట్లు చెప్పాడు. హార్పిక్ డబ్బాలు ఎందుకు తీసుకెళ్లారని బీజేపీ నాయకులు ప్రశ్నించగా నీళ్లు నమిలాడు. ఘటనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు షేక్‌బాబ్జాన్ తెలిపారు. ఎంఈఓ సుబ్బిరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో జరిగిన విషయం డీఈఓ దృష్టికి వెళ్లిందన్నారు. ఘటనపై హెచ్ఎం శిరీషా నుంచి రాత పూర్వకంగా వివరణ తీసుకున్నట్లు తెలిపారు.

ఒక్కటీ రాలేదు..!

● గీత కార్మికులకు 14 మద్యం దుకాణాలు
● రెండు రోజులే గడువు.. ఒక్క దరఖాస్తూ రాలేదు
● ఈడిగలు తప్ప.. ఉప కులాలు లేవంటున్న నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్, లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. దరఖాస్తుదారులు రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించాలని నిబంధన పెట్టింది. జనవరి 27 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇచ్చింది. 7వ తేదీన కలెక్టరేట్‌లో లాటరీ తీయాలని నిర్ణయించారు. 2016 స్మార్ట్ పల్స్ సర్వే ఆధారంగా జిల్లాలో ఈడిగ, గౌడ్, గౌడ, గౌండ్ల, కళాలి కులాలకు 14 మద్యం షాపులను కేటాయించారు. ఎక్సైజ్ అధికారులు గీత కార్మికులకు దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించారు. జిల్లాతోపాటు రాయలసీమలో కేవలం ఈడిగ కులస్థులం ఉన్నామని, ఉపకులాలు లేవని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి ఈడిగ కులస్థులు తీసుకెళ్లారని సమాచారం. అయితే జీవో ఆధారంగా ఉప కులాలకు కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలను కేటాయించారని అధికారులు చెప్పినట్లు తెలిసింది. సమగ్ర వివరాలు ఇవ్వాలని ఈడిగ సంక్షేమ సంఘం నాయకులు కోరినా, తమ వద్ద ఆ వివరాలు లేవని, నేరుగా ప్రభుత్వమే జీవో జారీ చేసిందని ఉన్నతాధికారులు చెప్పినట్లు సమాచారం. జీవో జారీకి ముందు స్థానిక సంఘాల నాయకులతో చర్చించి ఉంటే ఈ సమస్య తలెత్తేది కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత నెలలోనే జీవో జారీ చేయడంతో ఇప్పుడేమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

సీమలో ఈడిగలు మాత్రమే ఉన్నారు



పది శాతం దుకాణాలను కల్లుగీత కార్మికులకు కేటాయించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. రాయలసీమలో ఈడిగ కులస్థులు మాత్రమే ఉన్నారు. గౌడ్, గౌడ, గౌండ్ల, కళాలివారు లేరు. పేరుకు మమ్మల్ని గౌడ్ అని పిలిచినా బీసీ-బి ఈడిగ అనే సర్టిఫికెట్ ఇస్తున్నారు. 2016 స్మార్ట్ పల్స్ సర్వే ఆధారంగా జిల్లాలో ఈడిగతోపాటు మిగతా కులాలున్నట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి రాయలసీమలో ఈడిగలకే మద్యం షాపులు కేటాయించాలి. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గౌడ్‌లు ఉన్నారు. గౌడలు ఏపీలో ఎక్కడా లేరు. కర్ణాటకలో ఉన్నారు. విశాఖపట్నంలో కళాలి కులస్థులు ఉన్నారు.

- మేకల వేణుగోపాల్ గౌడ్, ఈడిగ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు.

నవ్విపోదురుగాక..!

అక్రమ వసూళ్లపై వీడియోలు ఉన్నా చర్యలు ఏవీ?

● లోలోపల బేరం కుదిరిందా..?
● డీసీటీఓ సుబ్బరాయుడు అంశంపై అనుమానాలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పన్నుల శాఖలో వసూల్‌రాజా వీడియోలు బహిర్గతమైనా చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. లోలోపల ఏదో మతలబు జరిగే ఉంటుందనే సందేహాలు తలెత్తుతున్నాయి. బేరసారాలు ఏమైనా జరిగాయా అనే అనుమానాలు కలుగుతున్నాయి. అనంతపురం సర్కిల్-2లో పనిచేస్తున్న డీసీటీఓ సుబ్బరాయుడు సంక్రాంతి పండుగ సమయంలో హైవేలపై వసూళ్లకు తెగబడ్డారు. తన కుమారుడిని వెంటబెట్టుకొని వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేశాడు. మూడు రోజుల అనంతరం ఆయనను నిలదీస్తున్న వీడియో బయటకొచ్చింది. రాత్రి సమయంలో నల్లబండల వాహనాన్ని ఆపి డబ్బు వసూలు చేయడంతో వారు ఆయనను నిలదీశారు. పన్నుల శాఖలో మీది ఏ కేడర్ అని, మీరు వాడుతున్న వాహనం డిపార్ట్‌మెంట్‌దేనా..? మీరు మద్యం తాగి కూడా ఇలా వసూలు చేస్తుంటారా అని ప్రశ్నించారు. కర్నూలు జిల్లా డోన్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఈ వీడియో బయటికి వచ్చి రెండు వారాలవుతున్నా డీసీటీఓపై ఆ శాఖాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విస్తుగొల్పుతోంది. డీసీటీఓపై చర్యలు తీసుకోకుండా ఉండటానికి బేరసారాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వమని సీటీఓ-2 నరసింహులుకు అప్పగించారు. డీసీటీఓ వసూళ్లు చేస్తున్న సమయంలో తాత్కాలిక నెంబరున్న కొత్త కారు ఉపయోగించారు. ఆ కారు వివరాలు తెలుసుకుంటున్నామంటూ సీటీఓ-2 చెబుతున్నారు. ఈయన వసూళ్లపై ఆరా తీయకుండా కారు గురించి ఎందుకు ఆరా తీస్తున్నారో అర్థం కావడం లేదు. మరోవైపు డీసీటీఓ సుబ్బరాయుడు రోజూ ఆఫీస్‌కు రావడం చూసిన అధికారులు, సిబ్బంది ముక్కున వేలేసుకుంటున్నారట.

పక్క జిల్లాలో ఏం పని..?


డీసీటీఓ సుబ్బరాయుడు, ఆయన కుమారుడిని నిలదీస్తున్న వాహనదారుడు (ఫైల్)

డీసీటీఓ సుబ్బరాయుడు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తనిఖీ చేసి డబ్బు వసూలు చేయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. జిల్లాలో ఎక్కడైనా లారీ తనిఖీ చేయాలంటే జిల్లా స్థాయి ఉన్నతాధికారైన జాయింట్ కమిషనర్(జేసీ) అనుమతి ఉండాలి. కానీ డీసీటీఓ జిల్లా పరిధి దాటి కర్నూలు జిల్లా డోన్‌లో వసూలు చేశారు. అలా తనిఖీ చేయాలంటే ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ అనుమతి ఉండాలి. ఇంత విరుద్ధంగా వసూలు చేయడం, ఆ వీడియో బయటకు వచ్చినా ఆయనపై చర్యలు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పైగా సంబంధిత డీసీటీఓ ఆ శాఖకు ఆదాయం తీసుకొచ్చే పని ఎప్పుడూ చేయలేదట. మరి ఇలాంటి అధికారిపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు ఆలోచిస్తున్నారో ఆ అధికారులకే తెలియాలి. కారు ఏ ప్రాంతానిది, యజమాని ఎవరు..?, అది జరిగిన ప్రాంతం ఎక్కడిది..? లాంటి కోణాల్లో విచారణ చేస్తూ అసలు విషయాన్ని మరుగున పెట్టేయాలని చూస్తున్నారనే విమర్శలున్నాయి. ఇందుకు ముడుపుల వ్యవహారం నడిచిందనే ఆరోపణలున్నాయి. నివేదిక ఇచ్చే విషయంలో ఆలస్యం కావడం పైనా విమర్శలు వెల్లువెత్తాయి. కాగా మూడు రోజుల కిందట ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు సీటీఓ నరసింహులు చెబుతున్నారు. ఆ నివేదికలో ఏముందో...ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

న్యూస్ బాక్స్

వేరుశనగ రైతులు జాగ్రత్తలు పాటించాలి

నల్లమాడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో వేరుశనగ సాగుచేసిన రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏఓ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రానికి సమీపంలో వేరు శనగ పంటను సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించిన ఆయన మాట్లాడారు. 30రోజులలోపు ఉన్న పంటకు చుక్కాకు మచ్చ తెగుళ్లు ఉంటే మాంన్‌కోజబ్‌ను 400 గ్రా. రెండు వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే 60రోజుల పైబడిన వేరుశనగ పంటకు మెస్కాకోనాజల్ 400 ఎంఎల్‌ను, రెండువందల లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. లద్దె పురుగు ఉంటే ఫ్లూబెండోమైడ్ 400 ఎంఎల్‌ను రెండువందల లీటర్ల నీటిలో పిచికారి చేయాలన్నారు. రసం పీల్చే పురుగు, తామర పురుగు, పేనుబంక, ఆకుపచ్చ దోమ నివారణకు డైమిదో మెట్ 60గ్రా. రెండువందల లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది రాధమ్మ, అస్మలం బాషా, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

స్వీపర్లకు వేతనాలు మంజూరు చేయాలి

ధర్మవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ధర్మవరం మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లకు నాలుగు నెలలుగా జీతాలు అందలేదని, వెంటనే వాటిని మంజూరు చేయించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్వీపర్లతో కలిసి మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, హైదర్‌వలీ, స్కూల్ ఆయాల కమిటీ నాయ కులు చౌడమ్మ, జయమ్మ, ప్రమీల, నాగలక్ష్మీ, నాగరత్న, నాగమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ నాయకులు ఎంపీడీఓ దివాకర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం, మోటార్లు, పైప్‌లైన్‌ల మరమ్మత్తులు చేయకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యద ర్శి చల్లా శ్రీనివాసులు, జాతీయ మానవ హక్కుల దక్షిణ భారత రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు వెంగమేష్ చౌదరి సీపీఐ నాయకులు తిప్పయ్య, చిన్నప్ప, నాయుడు, వెంకటరాముడు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాల దరఖాస్తుల గడువు పొడిగించాలని కదిరి డివిజన్ నాయీబ్రాహ్మణ, రజక సంఘం నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల వేదికలో ఆర్డీఓ వీవీ శర్మకు వినతి పత్రం అందజేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 30 నుంచి ఈనెల 7వ తేదీవరకు అవకామించారని, గ్రామీణులకు అవగాహన లేకపోవడంతో సరైన పత్రాలు సమకూర్చుకోవడంలో ఆలస్యమవుతోందని అన్నారు. కార్యక్రమంలో కేఆర్ హరిప్రసాద్, రమణ, శ్రీనివాసులు, మునికుమార్, గంగన్న, శంకర్,వేణు, ఈశ్వర్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అమడగూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే పీఆర్ఓ సంతోష్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ధర్మవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను ఆర్డీఓ మహేశ్ నిర్వహించారు. ఇందులో నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు వారివారి సమస్యలను అర్జీల రూపంలో ఆర్డీఓకు అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మాన్ని కమిషనర్ ప్రమోద్‌కుమార్ నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని పలు వార్డుల నుంచి డ్రైనేజీ, పారిశుధ్యం, ఫించన్లు తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్‌గాంధీ నగర్‌లో సోమవారం క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో క్షయ యూనిట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

7న చలో హైదరాబాద్

ధర్మవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈనెల 7న తలపెట్టిన లక్షల డప్పులు వేల గొంతుల కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నరేంద్రబాబు, బూదెప్ప, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు ఉలవల నాగరాజు పిలుపు నిచ్చారు. సోమవారం ముందుగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పలక రామాంజినేయులు, నాగరాజు, లక్ష్మయ్య, నారాయ ణస్వామి, నరసింహులు పాల్గొన్నారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం

తనకల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వైవీ కౌసల్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఏఓ శ్రీహరినాయక్ మాట్లాడుతూ.. రైతులు సాగుచేసిన పంటలను ఈ పంట నమోదు చేయించు కోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రెడ్డెప్ప, ఐసీడీఎస్ సీడీపీఓ జయంతి, అన్నిశాఖలాధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అక్కదేవతలకు ప్రత్యేక పూజలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదారెడ్డిపల్లి వద్ద వెలసిన సోమావతి అక్కదేవతల ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోరంట్ల మండలంలోని శెట్టిచలంపల్లికి చెందిన ఆంజనప్ప, మంగమ్మ భక్తులకు అన్నసంతర్పణం చేశారు. బండ్లపల్లికి చెందిన ఉమాదేవి, క్రిష్టప్ప ఆలయాభివృద్ధికి రూ.10,116లను విరాళంగా ఇచ్చారు.

ఊరుతోంది..!

- సమస్యల ఊట
- బుక్కపట్నం.. బురదమయం
- వీధుల్లో పారుతున్న ఊట నీరు
- ఇళ్లలోనూ ఊరుతున్న వైనం
- పాచిపట్టి జారిపడుతున్న ప్రజలు



బుక్కపట్నంలో బురదమయమైన రోడ్డు

బుక్కపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నీరు ఊరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుక్కపట్నం చెరువు నుంచి పంట పొలాలకు సాగునీటిని అందించే ప్రధాన కాలువలు రెండు మండల కేంద్రం మధ్య నుంచి వెళ్తున్నాయి. దీంతో ఈ ఊరు మొత్తం నీరు ఊరుతోంది. వీధుల్లో కాలువల్లా నీరు పారుతోంది. కొన్ని ఇళ్లల్లో కూడా నీరు ఊరుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ప్రధాన రహదారిపై సైతం ఊట నీరు కాలువ ప్రవహిస్తోంది. అలాగే బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద గల నాగుల కాలువ నుంచి భారీ ప్రవాహం చౌకధా న్యపు గిడ్డంగి గుండా ప్రవహిస్తోంది. బియ్యం లోడుతో వచ్చిన లారీలో ఆ బురదలో ఇరుకుపోతుండటంతో.. నానా తంటాలు పడుతున్నారు. అలాగే బండాగురప్ప వీధిలోకి సైతం ఊట నీరు పారుతోంది. ఇలా మూడు నెలల నుంచి నీరు పారుతుండటంతో రోడ్లు పాచి పట్టడంతో వృద్ధులు, విద్యార్థులు జారి పడి గాయపడుతున్నారు. ఆ రహదారులపై నడవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బైక్‌లు కూడా జారి పడుతున్నాయి. ఇళ్ల మధ్య నుంచి ఊట నీరు వస్తుండడంతో పునాదులు దెబ్బతిని ఎక్కడ కూలిపోతాయో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

● చోద్యం చూస్తున్న అధికారులు : మూడు నెలల నుంచి మండల కేంద్రంలో పలుచోట్ల ఊట నీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సాగునీటిని అందించే కాలువకు ఇరువైపులా సిమెంటు గోడలు ఏర్పాటు చేయడం వల్ల ఈ సమస్యను పరిష్కరించవచ్చు. అయితే అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. మండలాధికారులు, ఇరిగేషన్ అధికారులు తమకు ఏమీ సంబంధం లేన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు గత్యంతరం లేక బురదలోనే జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● కాలువల ఆక్రమణ : బుక్కపట్నం చెరువు నుంచి ఆయకట్టుకు నీరు అందించే పెద్దకాలువ, నాగుల కాలువలు ఆక్రమణతో కుచ్చించుకుపోయాయి. కాలువలకు ఇరువైపులా నివాసగృహాలు ఏర్పాటు చేసుకున్నవారు కొద్దికొద్దిగా కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. నీటి ప్రవహ ఉధృతికి కాలవులు పలుచోట్ల పొంగి పొర్లుతున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కాలువలను వెడల్పుపై సర్వే చేసి, ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇళ్ల వద్ద పాచి పట్టిన దృశ్యం



రోడ్డుపై నిల్వ ఉన్న ఊట నీరు

ఇళ్లు కూలే ప్రమాదం ఉంది..



మూడు నెలలుగా నీరు ఊరుతోంది. రోడ్లన్నీ పాచిపట్టాయి. వృద్ధులు జారిపడి గాయపడుతున్నారు. ఇలా నీరు ప్రవహిస్తుండడంతో ఇళ్లు కూలిపోయే ప్రమాదముంది. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

-జంగం వెంకటరాముడు, బుక్కపట్నం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



సమస్యను గతంలోనే ఇరిగేషన్ జేఈ జమున బాయి దృష్టికి తీసుకెళ్లాం. కాలువలకు మరమ్మతులు చేసి ఊట నీరు సమస్యను పరిష్కరించాలని కోరాం. ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించాం. కాలువల కిందసాగు చేస్తున్న పంట పూర్తి అయిన వెంటనే కాలువలకు మరమ్మతులు చేపడతామన్నారు.

-సంజీవరాయుడు, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు, బుక్కపట్నం

ప్రతిపాదనలు పంపాం

బుక్కపట్నం చెరువు నుంచి ఆయకట్టుకు నీటిని అందించే రెండు ప్రధాన కాలువలకు ఇరువైపులా సిమెంటు రక్షణ గోడల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. పంట పూర్తి అయిన తరువాత పనులు ప్రారంభిస్తాం. ఊట నీరు వీధుల్లోకి ప్రవహించకూడా పంచాయతీ వారు మురుగునీటి కాలవులు ఏర్పాటు చేసుకోవాలి.

-గంగాధర్, ఇరిగేషన్ డీఈఈ, బుక్కపట్నం



ఫుట్‌బాల్ క్రీడాకారులతో సభ్యులు

ఫుట్‌బాల్ పోటీల పరిశీలన

ధర్మవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో కేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా ధర్మవరంలో నిర్వహిస్తున్న అండర్-13 ఫుట్‌బాల్ పోటీలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అసోషియేషన్ అనిత సోమవారం పరిశీలించారు. ఫుట్‌బాల్ క్రీడలో మెలకువలు పాటించి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా సాధన చేయాలని సూచించారు. ఆమె వెంట ఫుట్‌బాల్ అసోషియేషన్ పట్టణ అధ్యక్షుడు రాఘవ, కార్యదర్శి చందు, వైస్ ప్రెసిడెంట్ సంధారాఘవ, కోశాధికారి జనార్దన్, జాయింట్ సెక్రటరీ జింకా పురుషోత్తం, కోచ్‌లు చైతన్య, దర్గా ఉన్నారు.

మద్యం షాపులకు టెండర్ల ఆహ్వానం

ధర్మవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్లుగీత కార్మికులు, గౌడ కులస్థులకు మద్యం షాపులకు కేటాయించిందని, వీటికి బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా టెండర్లు దాఖలు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటి కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. సోమవారం ఆయన ధర్మవరం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆ కార్యాలయ ఆవరణంలో గౌడ కులస్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 7వ తేదీన కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామన్నారు.

బీజేపీ నాయకుడి చికిత్సకు నిధులు మంజూరు

ధర్మవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ మండలానికి చెందిన బీజేపీ నాయకుడు, సామాజిక వేత్త గడ్డం రాజగోపాల్ తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతుండగా.. చికిత్స నిమిత్తం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4లక్షలు మంజూరు చేయించినట్టు బీజేపీ నాయకులు సోమవారం తెలిపారు. ఇటీవల రాజగోపాల్ అనారోగ్యంతో ఉన్న విషయాన్ని తెలుసుకున్న మం త్రి.. ఆయన్ను హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రిలో దగ్గరుండి చేర్పించినట్లు చెప్పారు. చికిత్సకు సీఎం సహాయ నిధి నుంచి రూ.4 లక్షలు మంజూరు చేయించి ఆ ఆస్పత్రి యాజమాన్యా నికి అందజేశారన్నారు. కాగా బసవతారకం ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న రాజగోపాల్‌ను టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సోమవారం పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

ధర్మవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీపీఐ నియోజవకర్గ కార్యదర్శి మునుగు మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో నాయకు లు సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మధు మాట్లాడుతూ.. అర్హత ఉన్న కూడా రేషన్‌కార్డులు లేనివారు చాలా మంది ఉన్నారన్నారు. అనంతరం ఆర్డీఓ మహేశ్‌కు వారు వినతిపత్రం అందజే శారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కాటమ య్య, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకట నారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, వ్యవసాయ కార్మికసంఘం నేత పెద్దన్న పాల్గొన్నారు.

వసంత పంచమి పూజలు

కదిరి అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకులవాండ్లపల్లి సమీపంలోని హరీష్ పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా పాఠశాల ఆవరణంలోని సరస్వతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎంఎస్ కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ధర్మవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన ఓ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... కేతిరెడ్డికాలనీకి చెందిన శ్రావణ్‌కుమార్ అనే యువకుడు అదే కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థినిని ప్రేమించాలని వేధిస్తున్నాడు. రోజూ కళాశాలకు వెళ్లే సమయంలో వెంట పడి వేధిస్తుండటంతో తల్లిదండ్రులు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో విచారించి ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



తనకల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముళ్లోలపల్లి సమీపంలో నల్లగంగమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పడింతులు మూడురోజుల పాటు పలురకాల పూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. మూడు రోజులుగా కోర్తికోట మాజీ సర్పంచ్ ఎస్‌కె మస్తాన్‌వలీ భక్తులకు అన్నసంతర్పణం చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల కన్వీనర్ కావడి ప్రవీణ్‌కుమార్, పలువురు భక్తులున్నారు.

పెమనకుంటపల్లి తండాలో మారెమ్మ విగ్రహం



మారెమ్మకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

నల్లమాడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెమనకుంటపల్లి తండాలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో భక్తులు, టీడీపీ నాయకులు, పెమనకుంటపల్లి తండా పెద్దలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతిభకనబరచిన ఉద్యోగులు గణతంత్ర దినోత్సవ రోజున కలెక్టర్ టీఎస్ చేతన్ చేతుల మీదుగా అవార్డు పొందారు. అవార్డు పొందినవారిని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానించారు. ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, వెలిచెలిమ సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ మహమ్మద్ షఫీ, కార్యదర్శి రెడ్డిభాస్కర్, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ శరత్, వీఆర్ఓ అనుషాను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాము, ఎంపీడీఓ ఆంజనప్ప, మండల స్థాయి అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించాలి

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు గత ప్రభుత్వం సంవత్సరానికి రూ.24 వేలు ప్రోత్సాహకం అందించేదని, ఆ పథకాన్ని పునరుద్ధరించాలని పలువురు నేత కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ముంద ఆందోళన చేపట్టారు. జిల్లా చేనేత కార్మిక ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు నేత కార్మికులకు ఇచ్చిన హామీని నేరవేర్చాలన్నారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం అందించారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న నేత కార్మికులు

క్రైం న్యూస్..

వ్యాన్ ఢీకొని కాడెద్దులు మృతి

ముదిగుబ్బ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కాడెద్దులు మరణించాయి. స్థానిక ముత్తయ్య చర్చి వీధికి చెందిన చంద్రశేఖర్ ముదిగుబ్బ నుంచి సంకేపల్లి వైపు ఎద్దుల బండి బయలుదేరాడు. కదిరి వైపు నుంచి అనంతపురం వైపు వెళ్లే పాల వ్యాను ఈ ఎద్దుల బండిని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో రెండు ఎద్దులూ అక్కడికక్కడే మరణించాయి. ఎద్దుల బండిలో ఉన్న చంద్రశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ సంఘటనా స్థలానికి వెళ్ళి చంద్రశేఖర్‌ను పరామర్శించారు. ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ బాధితుడిని ఫోన్‌లో పరామర్శిస్తూ.. ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అగ్నిప్రమాదం

తనకల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానివారిపల్లి గ్రామం వద్ద సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ఆకతాయిలు కొండకు నిప్పు పెటడంతో ఆ మంటలు సమీపంలోని ఉదయ్ శేఖర్‌కు పొలానికి వ్యాపించాయి. 150 మీటర్ల పైపులైన్, 40 మామి డి మొక్కలు, 25 స్ప్రింక్లర్ పైపులు, కూరగాయాల డ్రిప్ వైర్లు ఆహుతయ్యాయి. ప్రమాదంలో రూ.లక్షకుపైగా నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తిచేస్తున్నారు.

పైపులు ధ్వంసం

తాడిమర్రి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిమాకులపల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త మల్లాగుండ్ల మల్లన్న తన పొలానికి నీరు అందించేందుకు వేసుకున్న 30 పీవీసీ పైపులు, స్ప్రింకర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని సోమవారం గమనించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ క్రిష్ణవేణి, బీజేపీ నాయకులు హరీశ్, రామ్మోహన్, సోమశేఖర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇసుక టిప్పర్ల స్వాధీనం

బత్తలపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం వద్ద చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు టిప్పర్లను సోమవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. అనంతపురానికి చెందిన ఆ టిప్పర్లను స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేశామని చెప్పారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

కదిరి సీఐని సస్పెండ్ చేయాలి

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డిని సస్పెండ్ చేయాలని సోమవారం పుట్టపర్తిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద గల ధర్నా చౌక్‌లో దళిత సంఘాల నాయకులు ధర్నా, నిరవదిక దీక్ష సోమవారం చేపట్టారు. సీఐ ఓ ప్రజాప్రతినిధి అండతో సివిల్ వ్యవహారంలో తలదూర్చి పలువురిపై నాన్‌బెయిల్ బుల్ కేసులు నమోదు చేస్తున్నారని గిరిజన ప్రజాసమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున్‌నాయక్ ఆరోపించారు. కా ర్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నారాయణస్వామి, బీజేపీ శివ, వెంకటేష్, జనసేన బాలక్రిష్ణ, ఆకుల ఓబులేసు, రాజశేఖర్, విష్ణు పాల్గొన్నారు.

గుర్రప్పస్వామికి ప్రత్యేక పూజలు

ధర్మవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక లోనికోటలోని గుర్రప్ప స్వామి ఆలయంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి కోసం కమిటీ అధ్యక్షుడు చంద్రకు రూ.10 వేలను విరాళంగా అందజేశారు.

న్యూస్ బాక్స్

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు




పూజల్లో పాల్గొన్న భక్తులు

పరిగి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జయమంగళి నది తీర ప్రాంతంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి మూడో శష్టి సందర్భంగా దివ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో సోమవారం పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు, సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన, దేవతల ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం జరిపారు. పూజలకు పెద్దఎత్తున భక్తాదులు తరలివచ్చారు. కార్యక్రమంలో వడ్డె హనుమయ్య, మూర్తి, శివ, చౌడప్ప, భక్తులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని పసరవక్కరి వద్దన వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు పంచాంగం శేషప్పస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.

ఘనంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

రొళ్ల: మండలలోని రత్నగిరి గ్రామంలో సోమవారం సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ రామారావు, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ సుందరరాజు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా పాల పొంగుల షష్ఠి



పూజలందుకుంటున్న స్వామివారు

పావగడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారంగా కొలిచే నాగలమడక అంత్యసుబ్రమణ్యేశ్వర స్వామి సన్నిధిలో పాల పొంగుల షష్ఠిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మార్గశిర మాసంలో పుట్టప్ప షష్ఠి, పుష్య మాసంలో సుబ్రహ్మణ్య షష్ఠి పాలు పొంగలి షష్ఠి ఆచరించడం ఆనవాయితీగా వచ్చిందని ఆలయ ప్రధాన అర్చకులు బద్రీనాథ్ తెలిపారు. సోమవారం ఉదయం 5నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, మహాన్యాసపూర్వక ఏకాదశరాధన, రుద్రాభిషేకం, అష్టోతర నామ, సహస్ర నామ, కుంకుమార్చన, ప్రాకారోత్సవం, అష్టావదానసేవ, మహానైవేద్యనామం, మహామంగళహారతి, అన్నసంతర్పణ, స్వామివారి విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాన్ని వేలాదిమంది భక్తుల నడుమ వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు.

గంగమ్మ ఆలయ వార్షికోత్సవం



కలశాలను మోస్తున్న భక్తులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకంఠపురం గ్రామదేవత గంగమ్మతల్లి ఆలయంలో సోమవారం 2వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ, దుర్గాసూక్త, సుదర్శన, ఆయుష్, సాధున్యదేవత,మృత్యుంజయ హోమాలు, గంగాదేవి, పంచామృత అభిషేకాలు, అలంకరణ, షోడసోపచార పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతి, ప్రధాన దేవతలకు కళశాలలు మోసి అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పూలు, నగలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

అనుమనపల్లికి చేరిన మహాలక్ష్మీదేవి



అలంకరణలో అమ్మవారు

అగళి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలం అనుమనపల్లి గ్రామంలో మూడు రోజులపాటు రత్నగిరి కొల్లాపురి మహాలక్ష్మీదేవి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం అమ్మవారిని అనుమనపల్లి గ్రామానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని వివిధ పూల అలంకరణలతో అలంకరించారు. మంగళ, బుధవారాల్లో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ చంద్రప్ప తెలిపారు.

వైభవంగా జలధి

అమరాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదుగూరు గ్రామంలో వెలిసిన కెంచమాంబదేవి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 3న ప్రారంభమైన ఉత్సవాలు 5వతేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీవారు తెలిపారు. సోమవారం అమ్మవారికి జలధి కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆలయం నుంచి వంక వరకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లి వంకలో జలధి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పూలతో ప్రత్యేకంగా అలంకరించి 101 ఆకులతో ఎడలువేసి మహా మంగళహారతి ఇచ్చి, వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వంక నుంచి అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారిని దేవాలయ ప్రవేశం చేశారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

మడకశిర రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంతర్ పాలిటెక్నిక్ క్రీడా, సాంస్కృతిక ఉత్సవాల్లో మడకశిర వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు అచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ సరోజిని దేవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 20 కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు మహానందిలో అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో మడకశిర వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు క్రీడా విభాగంలో టేబుల్ టెన్నిస్‌లో నిలిచారన్నారు. చెస్, క్యారమ్స్, షటిల్ విభాగంలో రన్నర్స్‌గా నిలిచినట్లు తెలిపారు. సాంస్కృతిక విభాగంలో ఓవరాల్ చాంపియన్లుగా మడకశిర విద్యార్థులు నిలిచారన్నారు. గెలుపొందిన విద్యార్థులను డీన్‌తోపాటు అధ్యాపకులు అభినందించారు.



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో అధ్యాపకులు

వైసీపీలోనే దిక్కులేదు.. మంత్రిపై విమర్శలా..?

- శంకర్ నారాయణపై టీడీపీ నాయకుల ధ్వజం



పెనుకొండలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'నీ అవినీతి అక్రమాలు అధిష్టానానికి తెలిసి పెనుకొండ నుంచి అనంతపురానికి బదిలీచేసి అక్కడ ఎంపీ అభ్యర్థిగా ఓటమిపాలై వైసీపీలో పీకేసిన మొక్క నీవు శంకర్‌నారాయణ' అంటూ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కన్వీనర్ శ్రీరాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మంత్రి సవితపై పలు విమర్శలు చేయడాన్ని వారు ఖండించారు. గతంలో బీసీ సంక్షేమ శాఖమంత్రిగా ఉన్న సమయంలో మీరు పెనుకొండ హాస్టల్‌లో నిద్రచేసి ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. అదే మంత్రి సవిత సొంత డబ్బు రూ.11లక్షలు, దాతల సహకారంతో రూ.46లక్షలు వెచ్చించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారన్నారు. 2014-19లో గొల్లపల్లి రిజర్వాయర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగు మార్లు పర్యటించి పూర్తీచేయించి చెరువులకు నీరందించారన్నారు. ప్రస్తుతం కాలువలు మరమ్మతులు చేస్తున్నామని త్వరలోనే అన్ని చెరువులకు నీరందిస్తామన్నారు. మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, రామలింగ, సిద్దయ్య, చిన్నవెంకటరాముడు పాల్గొన్నారు.

చౌకబారు రాజకీయాలు మానుకో..

గోరంట్ల: మాజీ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ గతంలో అక్రమంగా సంపాదించిన ఆస్తులను కాపాడుకునేందుకు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ విమర్శించారు. గోరంట్లలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి సవితపై మాలగుండ్ల చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. జగన్‌మ్మోహన్‌రెడ్డిని విమర్శించడం ద్వారా చంద్రబాబు, లోకేష్‌ల దృష్టిలో పడాలని మంత్రి సవిత చేస్తున్నారనడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. పార్టీ దృష్టిలో ఉన్నందును సవిత ఎమ్మెల్యే, మంత్రి కాగాలిగారన్న విషయం ఆయన తెలుసుకోవాలన్నారు. వలసపక్షిగా వచ్చి, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఆయనను స్థానిక కార్యకర్తలు వెలివేస్తే, పార్టీ బదిలీ చేసిందన్నారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులున్నారు.

పద్మభూషణ్ అవార్డు గ్రహీతకు సన్మానం



ఎమ్మెల్యే బాలకృష్ణను సన్మానిస్తున్న బంగి నాగ, బేకరి గంగాధర్

హిందూపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సినీనటుడు పద్మభూషణ్ అవార్డు గ్రహీత నందమూరి బాలకృష్ణను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగినాగా గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే నివాసం వద్ద ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరి గంగాధర్, అనంతపురానికి చెందిన బంగి నాగ భారీ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సినీరంగంలో ప్రేక్షకులను అలరించడంతోపాటు రాజకీయంగా సామాజికంగా సేవా కార్యక్రమాలు అందిస్తున్న నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేష్‌నాయుడు, బంగి ఓబుళపతి, వడ్డె రమేష్, వడ్డె హనుమంతరాయుడు, సాదిక్, పల్లి పృథ్విసాయి, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

యువ క్రికెటర్‌కు సన్మానం



యువ క్రికెటర్ జితేంద్రను సన్మానిస్తున్న గ్రామస్థులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో గత నెలలో జరిగిన దివ్యాంగుల చాంపియన్‌షిప్ క్రికెట్ పోటీల్లో చోటు సంపాదించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన యువక్రికెటర్ జితేంద్రని కొడికొండ గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించి అభినందించారు. క్రికెటర్ జితేంద్ర మండలంలోని బలిజపల్లి గ్రామానికి చెందిన వాడు. ఇతను గతంలో ఒకసారి దివ్యాంగుల వరల్డ్ కప్ జట్టుకు, పలు సార్లు జాతీయ జట్టులో స్థానం సంపాదించాడు. ప్రస్తుతం శ్రీలంక రాజధాని కొలంబోలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు బాలాజీ, సోమశేఖర్ మాట్లాడుతూ.. జితేంద్ర తనకున్న అంగవైకల్యాన్ని లెక్కచేయకుండా క్రికెట్‌లో రాణిస్తూ జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు అలీముల్లా, శ్రీనివాసులు, పురుషోత్తంరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేషం సబ్సిడీ అమలు చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న చేనేత కార్మికులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రేషంపై సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని రేషం కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం చేనేత కార్మికుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్మికులు చలో కలెక్టరేట్ చేపట్టారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్, చేతన్, హ్యాండ్‌లూం ఏడీ రామకృష్ణకు వినతులు అందించారు. 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 4 కేజీల రేషంకు సబ్సిడీ రూ.1000 చెల్లించేదని, తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సబ్సిడీ పెంచి రూ.2వేలు అందించిందన్నారు. గత ఎన్నికలకు ముందు చంద్రబాబు చేనేత కార్మికులకు సబ్సిడీ కొనసాగిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం రేషం ధర కేజీ రూ.5700, వార్పు కేజీ రూ.6200 ఉందన్నారు. దీంతో కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. ప్రభుత్వం సంవత్సరానికి రూ.24 వేలు సబ్సిడీ ఇచ్చి ఆదుకోఆలని సోమవారం కలెక్టర్‌ను కలిశారు. చేనేతలకు రేషం సబ్సిడీ పథకం పునరుద్ధరించాలని చేనేతలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందిస్తూ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. చేనేత ఐక్యవేదిక సభ్యులు దేవరాజ్, బాబుసాబ్, అమర్‌నాథ్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

మడకశిర టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి వైకుంఠ ద్వారా దర్శనం టికెట్ల కౌంటర్ వద్ద చోటు చేసుకొన్న తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన దుర్గమ్మకు సోమవారం టీటీడీ బోర్డు సభ్యులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆర్థిక సాయం అందజేశారు. అనంతపురంలోని ఆయన నివాసంలో రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు ద్వారా బాధితురాలికి అందించారు.

ఎట్టకేలకు మరణ ధ్రువీకరణ పత్రం పంపిణీ

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మావటూరు గ్రామ సచివాలయంలో సోమవారం సుధాకర్‌రెడ్డి మరణ ధ్రువీకరణ పత్రాన్ని సచివాలయ ఉద్యోగులు కుటుంబ సభ్యులకు అందజేశారు. మావటూరు గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి రెండు నెలలక్రితం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి పలుమార్లు అధికారులకు మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని విన్నవించినా పట్టించుకోకపోవడంతో నాలుగు రోజుల క్రితం సచివాలయం ముందు బాధిత కుటుంబ సభ్యులు పురుగుల మందుతో ఆందోళన వ్యక్తం చేయడంతో స్పందించిన అధికారులు సోమవారం మరణ ధ్రువీకరణ పత్రం అందజేశారు.

ఉత్తమ నిర్మాత.. జీఎం సరేష్

గోరంట్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో నిర్వహించిన షార్టు ఫిల్మ్‌ఫెస్టివల్‌లో పలు అవార్డులు లభించాయని జీఎంఎస్ గ్యాలరీ అధినేత గోరంట్లకు చెందిన నిర్మాత జీఎం సరేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరుగుదొడ్లు లేక మహిళలు పడుతున్న ఇబ్బందులపై తయారు చేసిన స్క్రిప్ట్ మొదటి బహుమతిగా రూ.50వేలు నగదు లభించిందన్నారు.

మామిడి తోటకు నిప్పు

పరిగి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగరాజులపల్లిలో ఉంటున్న వెంకటేశ్, విష్ణు అనే రైతులకు చెందిన మామిడితోటలకు నిప్పంటుకుంది. రైతు విష్ణు తెలిపిన మేరకు గ్రామ సమీపంలో ఆరెకరాల భూమిలో మామిడి పంటను సాగుచేస్తున్నట్లు తెలిపారు. మామిడి చెట్లు పూతకు వచ్చి రెండు నెలల్లో కాయలు చేతికందే సమయానికి పరిసర ప్రాంతాల్లో ఆకతాయిలు నిప్పంటించడంతో గాలికి మామిడితోట అంటుకుని సుమారు 120 చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి నష్టాన్ని అంచనావేసి పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

మహిళ ఆత్మహత్య



అపర్ణ (ఫైల్)

పావగడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వివాహమై ఇద్దరు పిల్లలున్న మహిళను అదే గ్రామానికి చెందిన వ్యక్తి తనను ప్రేమించాలని వేధించడంతో, పరువుకోసం అపర్ణ(26) అనే మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన క్యాతగానిచెరువు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మధుగిరి డీఎస్పీ మంజునాథ్, తిరుమణి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన మేరకు వళ్లూరు గ్రామానికి చెందిన అపర్ణ, క్యాతగానిచెరువుకు చెందిన నరసింహతో వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. అదే గ్రామానికి చెందిన రామాంజినరెడ్డి అనే వ్యక్తి ఆమెను తరచూ తన ఫోన్‌నంబరు ఇచ్చి ఫోన్‌చేయాలని వేధిస్తుండేవాడన్నారు. దీనిపై తన భర్త పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో వారు రామాంజినరెడ్డిని మందలించారన్నారు. ఆదివారం రాత్రి అపర్ణ ఇంటికి రామాంజినరెడ్డి వెళ్లి తన విషయం అందరికీ చెప్పావని తనను ప్రేమించకపోతే నిన్ను, నీభర్తను చంపుతానని బెదిరించాడని అపర్ణ తన భర్త దృష్టికి తీసుకెళ్లింది. ఉదయం ఈ విషయంపై మాట్లాడదామని శివమాలధరించిన నరసింహులు తెలిపాడన్నారు. సోమవారం తెల్లవారుజామున ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భార్య మరణానికి రామాంజినరెడ్డి బలవంతమే కారణమని నరసింహులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు డీఎస్పీ తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసం

వసంత పంచమి సందర్భంగా సోమవారం పలు పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆయా పాఠశాలల నిర్వాహకులు తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



పెనుకొండ: గ్లోబల్‌జెన్ పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



సోమందేపల్లిలో...

నేడు రథసప్తమి

పెనుకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌బజార్‌లో వెలసిన ఘనగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు కృష్ణమాచార్యులు తెలిపారు. ఉదయం ప్రగతి గ్లోబుల్‌జెన్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసులు, మంజువాణి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, తీర్థ ప్రసాద వినియోగం అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను సూర్యప్రభ వాహనాలపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.